## క్లుప్తంగా

### కుట్టుమిషన్ వితరణ



కుట్టుమిషన్ అందజేస్తున్న మిశ్రో

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.కె.మిశ్రో ఆదే గ్రామానికి చెందిన వితంతువు, పేద మహిళ కవిత పాణిగ్రహికి కుట్టు మిషన్ వితరణగా ఇచ్చారు. మిశ్రో తన స్వంత నిధులతో కొనుగోలు చేసిన కుట్టు మిషన్‌ను సోమవారం అందజేశారు. లక్ష్మీనర్సుపేట వైస్ సర్పంచ్ అశోక్ పాణిగ్రహి, గ్రామ పెద్ద మురళీ పండా, గ్రామస్తులు తిరుపతిరావు, దుర్గారావు, అజయ్, గోపి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓగా రాంబాబు



ఎంపీడీఓ రాంబాబు

సారవకోట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన విశ్వేశ్వరరావు గత నెలలో మృతి చెందడంతో ఎంపీడీఓ పోస్టు ఖాళీ అయింది. విజయనగరం జిల్లా తెర్లాం మండల ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న రాంబాబును ఉద్యోగోన్నతిపై సారవకోట ఎంపీడీఓగా నియమించారు. ఆయనను స్థానిక సిబ్బంది అభినందించారు.

### కంటి శస్త్ర చికిత్సలకు 62 మంది ఎంపిక



కంటి రోగులకు తనిఖీలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీలో సోమవారం సేవా భారతి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరంలో 62 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. 120 మంది కంటి రోగులకు తనిఖీలు చేశారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిలో 40 మందిని శంకర్ ఫౌండేషన్ వాహనంలో తరలించారు. మిగిలిన వారికి రెండో విడతలో ఆపరేషన్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి ప్రతినిధులు కె.ఎల్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.


### పాండురంగ స్వామికి ప్రత్యేక పూజలు



పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని మడపాం పంచాయతీ కొత్తపేటలోని పాండురంగస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నిర్మించిన ఆలయ సింహద్వారాన్ని కొత్తపేట ప్రధాన వీధి వద్ద ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. ఆలయం మరింత ప్రసిద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, బొబ్బాది ఈశ్వరరావు, గ్రామానికి చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన



పోలాకి: గంగివలస కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లింగరాజు

పోలాకి: మండలంలోని గంగివలస కేజీబీవీలో మధ్యాహ్న భోజనం సరిగా అందించటం లేదని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో ఎంఈవో లింగరాజు సోమవారం పాఠశాలకు వెళ్లి పరిశీలన చేపట్టారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. వంటల్లో కొన్నిసార్లు నాణ్యతలోపించిన మాట వాస్తవమేనని, ఇప్పుడు బాగానే ఉందని బాలికలు చెప్పారు. దీంతో ఎస్ఓ శారద నుంచి ఎంఈవో వివరణ కోరారు. ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందించటంపై ప్రత్యేక శ్రద్ధచూపుతుందని, ఎక్కడైనా తప్పు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలం మొత్తం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక డ్రైవ్‌చేపడతామని ఎంఈఓ-2 లింగరాజు తెలిపారు.

**రుచి, శుచి తప్పనిసరి..**

జలుమూరు: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యతతోపాటు రుచి, శుచి పాటించాలని ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. లింగాలవలస ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం పరిశీలించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు: అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వీఆర్ గూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం..**

నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వీఆర్ గూడెంలో ఇంటింటికీ కుళాయిలు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.85 లక్షలతో జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, గురుగుబెల్లి వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణరావు, తహసీల్దార్ వై.వి.ప్రసాద్, ఎంపీడీఓ హరిహరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విక్రయ కేంద్రాన్ని వినియోగించుకోవాలి



కూరగాయల విక్రయాలను ప్రారంభిస్తున్న డీపీఎం, ఏడీఏ

కొత్తూరు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు వినియోగించుకోవాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం రేవతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంసముదాయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయ కేంద్రాన్ని డీపీఎం ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ఆరోగ్యకరమైన పంటలు తక్కువ ధరలకు విక్రయించడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలు విక్రయ కేంద్రానికి తీసుకువస్తే పంటకు గిట్టుబాటు ఉంటుందన్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరలకు ఈ కేంద్రం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏడీఏ రాజగోపాలరావు, ఏఓ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గుమ్మపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని గుమ్మపాడు సచివాలయ పరిధిలో గుమ్మపాడు పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

## నియోజకవర్గ స్థాయి ఆటలపోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కేశవరావు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీల్లో పాల్గొని సచివాలయం, మండల స్థాయి పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం టి.కేశవరావు సోమవారం తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో విద్యార్థులు నియోజవర్గ పోటీలకు ఎంపిక కావడంతో అభినందనలు తెలిపారు.

## అక్రమ నిర్మాణంపై దర్యాప్తు



పెద్దపద్మాపురంలో అక్రమ నిర్మాణంపై దర్యాప్తు నిర్వహిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలోనే ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి సోమవారం దర్యాప్తు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి హైకోర్టుకు వెళ్లి న్యాయంచేయాలని పిటిషన్ వేశారు. నెల రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామస్తుల సమక్షంలో అధికారులు వివరాలు సేకరించారు. గతంలో సర్వే నంబర్ 291లో 8 సెంట్ల స్థలాన్ని గ్రామ సచివాలయం నిర్మాణానికి అధికారులు కేటాయించారు. ఇందులో రెండు సెంట్ల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టాడని ఎంపీటీసీ సభ్యురాలు ఉర్లాన హంసమ్మ, వైఎస్సార్‌సీపీ నేత రుషి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని ఆపాలని సదరు వ్యక్తికి అధికారులు నోటీసులు ఇచ్చినా.. ఖాతరు చేయకుండా రాత్రి వేళల్లో నిర్మాణం చేపట్టినట్లు ఎంపీటీసీ సభ్యురాలు ఉర్లాన హంసమ్మ తెలిపారు. నిర్మాణం చేపట్టిన సమయంలో గ్రామ పంచాయతీ తీర్మానం ఉందా, అనుమతులు ఇచ్చిందా, గ్రామకంఠమా, కాదా అనేది పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు. త్వరలోనే పూర్తినివేదికను అందజేస్తామన్నారు. ఆర్ఐ వైకుంఠరావు, ఏఓ తిరుపతి పటానాయక్, వీఆర్‌ఓలు శ్యామ్యూల్, అన్నాజీరావు, శ్రీధర్, గ్రామస్తులు ఉన్నారు.

## మదనాపురం సర్పంచ్ ఉదారత

- రూ.లక్ష సొంత నిధులతో రోడ్డు పనులు



రోడ్డును బాగు చేయిస్తున్న సర్పంచ్ కొంచాడ వెంకటరమణ

కొత్తూరు: మండలంలోని మదనాపురం సర్పంచ్ కొంచాడ వెంకటరమణ తన సొంత నిధులతో నివగాం-మదనాపురం రోడ్డు పనులను సోమవారం చేపట్టారు. ఈ రోడ్డు వర్షాలకు పాడవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున సర్పంచ్ స్పందించారు. రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చివేశారు. దీంతో కష్టాలు తీరాయని పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# పౌష్టికాహారం పంపిణీ



నరసన్నపేట: తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఆమదాలవలస రూరల్: గర్భిణులకు భోజనాలు అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కులపేట పీహెచ్‌సీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైద్యాధికారులు బొడ్డేపల్లి వసంత, కూన మీనాకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలలో 9వ తేదీన పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలకు హాజరైన గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేయడం సమితి సేవలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమం గత ఏడు సంవత్సరాలుగా అంతరాయం లేకుండా నిర్వహించడం ఎంతో ఆనందాయకమన్నారు. ఈ నెల అక్కులపేట గ్రామానికి చెందిన మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు దంపతులు పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సీహెచ్ సూర్యారావు, యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, సభ్యులు జ్యోతి, పవన్, వెంకట్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు..**

నరసన్నపేట: మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 42 మంది గర్భిణులకు తనిఖీలు చేశారు. రక్త హీనతతో బాధపడుతున్న వారికి ఆహార నియమాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సీతామహాలక్ష్మి, శిరీష సూచించారు.

## న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

ఆమదాలవలస: న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పించాలని ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి బాయ్ ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు వారి హక్కుల కోసం శాంతియుత నిరసన కార్యక్రమం చేస్తుండగా.. పోలీసులు అమానుషంగా న్యాయవాదులపై లాఠీలతో విరుచుకుపడటం తగదన్నారు. దీనికి నిరసనగా ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట సోమవారం నిరసన తెలిపారు. న్యాయవాదులంతా విధులు బహిష్కరించారు. న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, కిల్లి మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి వైద్య సేవలు

- అక్కులపేట, బూర్జ, గుత్తావల్లి పీహెచ్‌సీలకు అక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస రూరల్: ఆక్సిజన్‌కాన్సన్‌ట్రేటర్‌ను అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని అక్కులపేట గ్రామంలో గల పీహెచ్‌సీకి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరున ట్రస్టు ద్వారా అపద సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తమవంతు సాయంగా ఆదుకుంటున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, వైద్యాధికారులు మీనాకుమారి, వసంత, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట**

బూర్జ: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బూర్జ, గుత్తావల్లి గ్రామాల్లోని పీహెచ్‌సీలకు తమ్మినేని ఇందుమతి, శ్రీరామ్మూర్తి చారిటబుల్ ట్రస్టు తరఫున సోమవారం ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను స్పీకర్ సంబంధిత వైద్యాధికారులకు అందజేశారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, బూర్జ, గుత్తావల్లి వైద్యాధికారులు, సిబ్బంది, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చింతాడ గణపతిస్వామికి డాక్టరేట్

కొత్తూరు: మండలంలోని గులివిందలపేట గ్రామానికి చెందిన చింతాడ గణపతి స్వామికి విశాఖపట్నంలో జరిగిన కన్వొకేషన్-2023లో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందించారు. స్టాటిస్టిక్స్ విభాగంలో ×క్వీయింగ్ మోడల్ విత్ డూన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ అనే అంశంపై ఉత్తమ పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందజేశారు. గణపతిస్వామిది వ్యవసాయ కుటుంబం. కుమారుడు గణపతిస్వామి. గోల్డ్‌మెడల్ సాధించినందుకు తల్లిదండ్రులు గంగయ్య, పద్మావతి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## పారిశుద్ధ్య పనులు నిర్వహించండి

మెళియాపుట్టి: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రకుమారికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలాకి జయమునిరావు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో చెత్త పేరుకుపోయి ఎక్కడికక్కడే దుర్గంధం వెదజల్లుతుందన్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య పనులు చేయాలని కోరారు. వార్డు సభ్యుడు పరపటి యోగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జయమునిరావు

# ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



హిరమండలం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం ద్వారా గర్భిణులకు అందజేస్తున్న సేవలను సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ రికార్డులు, ఓపీని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలపై స్థానిక ప్రజలను, రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న సేవలు బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. 108, 104, ఆరోగ్యశ్రీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశట్టారన్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు ఎక్కువగా వైద్యసేవలు పొందుతున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ఆస్పత్రుల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ నెల 15 నుంచి ఆరోగ్య సురక్ష పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. విప్లవాత్మక చర్యలతో, వినూత్న పథకాలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా సీఎం జగన్ సర్కార్ ప్రజారోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు సి.హెచ్.సాయిగీత, హుస్సేన్, ఎంపీడీఓ బి.శైలజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్ డి.సుందరమ్మ, ఉప సర్పంచ్ వి.బాలరాజు, నాయకులు వి.చిన్నారావు, శంకర్‌రావు, ఎ.కృష్ణారావు, సక్కా ఆనందరావు వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చట్టం దృష్టిలో అందరూ సమానమే

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ

ఆమదాలవలస: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి బట్టబయలు అయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. ఆమదాలవలసలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్ సక్రమమే అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు ప్రజాధనాన్ని లూటీ చేశారనే ఆయనకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు. ఎన్నో స్కాములు చేసి వ్యవస్థలను ఆయనకు అనుకూలంగా చేసుకున్న చంద్రబాబు కథ అడ్డం తిరిగిందన్నారు. మిగిలిన స్కాముల్లోనూ చంద్రబాబు, అతని అనుచరులను పాల్పడిన అక్రమాలపై దర్యాప్తు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కిల్‌డవలప్‌మెంట్‌కు సంబంధిచిన స్కామ్‌లో చంద్రబాబు తన సొంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్న నేపథ్యంలోనే అరెస్ట్ చేశారని, దీనికి కోర్టు రిమాండ్ విధిస్తే.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అకారణంగా బంద్ చేసి జనజీవనానికి ఆటంకం కలిగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ వైకుంఠరావు, రాపాక ఎంపీటీసీ సభ్యుడు పోతురాజు సూర్యారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెయ్యల ప్రసాద్, బొడ్డేపల్లి మన్మథ, చింతాడ శివ, పైడి విజయ్, రాజశేఖర్, కిరణ్ తదితరులు ఉన్నారు

## ఆధ్యాత్మిక భావాలు అలవాటు చేసుకోవాలి



పుష్కరిణిని ప్రారంభిస్తున్న దాత లావేటి జగన్నాథరావు

సరుబుజ్జిలి: ఆధ్యాత్మిక చింతన మానవ జీవితంలో భాగం కావాలని కొండవలస గ్రామానికి చెందిన రిటైర్డ్ ఇంజినీర్ లావేటి జగన్నాథరావు అన్నారు. మండలంలోని చినపాలెం గ్రామానికి సమీపం దంతపురి క్షేత్రంలో గల సోమాలమ్మ తల్లి ఆలయం ఆవరణలో తన భార్య కమలమ్మ జ్ఞాపకార్థం రూ.7లక్షలతో నిర్మించిన పుష్కరిణిని, మెట్ల మార్గం, ముఖద్వారాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు, అర్చకులు మావుడూరి కృష్ణారావుశర్మ, దాత కుటుంబ సభ్యులు శ్రీధర్, బృంద, సత్యనారాయణ, నర్సింగరావు పాల్గొన్నారు.

## త్రినాథరావు మృతి పార్టీకి తీరని లోటు



త్రినాథరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండల సచివాలయం కన్వీనర్, కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు భర్త కామక త్రినాథరావు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటుని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కుంటిభద్ర కాలనీలో త్రినాథరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. త్రినాథరావు చిత్రపటానికి కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణతోపాటు పలువురు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో త్రినాథరావు పార్టీ కోసం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయునిగా, ఎంఈఓగా, రాజకీయ నేతగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. త్రినాథరావు తండ్రి దాలయ్య, భార్య కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, లోతుగెడ్డ తిరుపతిరావు, వై.ధర్మారావు, వనుము లక్ష్మీనారాయణ, తమ్మినాయుడు, బీఎస్పీ జిల్లా నేత బొడ్డేపపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.